క్లుప్తంగా

రేపు విద్యుత్తు సరఫరాకు అంతరాయం

మండపేట: పట్టణంలోని ఇండస్ట్రియల్ సబ్ స్టేషన్‌లో సాధారణ మరమ్మతుల నిమిత్తం ఈ నెల 4 ఉదయం ఏడు నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకూ విద్యుత్తు సరఫరాను నిలిపి వేస్తామని ట్రాన్స్‌కో రామచంద్రపురం ఈఈ డి.శ్రీధరవర్మ తెలిపారు. ఆ సమయంలో పట్టణంలోని అన్ని పరిశ్రమలతో పాటు విజయలక్ష్మి నగర్, వీరభద్రపురాలకు విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందన్నారు.

మృతుడి కుటుంబానికి అండగా ఉంటాం



మృతుడి తల్లికి సాయం అందజేస్తున్న నరేన్

రామచంద్రపురం రూరల్: ఇటీవల మండలంలోని కాపవరంలో బైక్ ప్రమాదంలో మృతి చెందిన కొండాయపాలెపు వీరబాబు (30) కుటుంబానికి అండగా ఉంటామని వైఎస్సార్ సీపీ యువనేత చెల్లుబోయిన నరేన్ అన్నారు. వైఎస్సార్ బీమా రూ.5 లక్షల అందించే పథకంలో భాగంగా తక్షణ సాయంగా అందించే రూ.10 వేలు మృతుడి తల్లిలక్ష్మికి నరేన్ అందజేశారు. మృతుడిని భార్య, 3 నెలల పాప, తల్లి, తండ్రి ఉండగా వారికి అండగా ఉంటామని నరేన్ భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో ఎంపీటీసీ రెడ్నం వీవీ సత్యనారాయణ, పంచాయతీ కార్యదర్శి రాయుడు మోహన్, వెల్ఫేర్ అసిస్టెంట్ శ్రీరామలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా మల్లేశ్వరుని కల్యాణం

కె.గంగవరం: మండలంలోని కుందూరులో కొలువైన మల్లేశ్వరస్వామి కల్యాణాన్ని శనివారం రాత్రి వేదపండితులు ఘనంగా నిర్వహించారు. కల్యాణం సందర్భంగా ఆలయాన్ని విద్యుత్ దీపాలతో సర్వాంగ సుందరంగా అలంకరించారు. ఆలయ ఈఓ ఎంవీవీ సత్యనారాయణ ఆధ్వర్యంలో వేదపండితులు ప్రత్యేక పూజలు చేసి స్వామి వారి కల్యాణం కన్నులపండువగా నిర్వహించి తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు. ఎంపీపీ పంపన నాగమణి, సర్పంచ్ పంపన సత్యానందం, గ్రామ పెద్దలు సుబ్బారావు తదితరులు స్వామి వారి కల్యాణంలో పాల్గొన్నారు.

ప్రజా సమస్యలపై ప్రచార జాతాలు, పాదయాత్రలు

రామచంద్రపురం: భారత్ బచావో, మోదీ హటావో నినాదంతో పాటు ప్రజా సమస్యలపై సీపీఐ ఆధ్వర్యంలో దేశ వ్యాప్త ప్రచార జాతాలు, పాదయాత్రలు నిర్వహిస్తున్నట్లు ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి దేగా ప్రభాకర్ తెలపారు. పట్టణంలోని చెలికాని రామారావు స్మారక భవనంలో ఆదివారం పార్టీ సమావేశంలో గొర్రిపర్తి రాజు అధ్యక్షతన జరిగింది. సమావేశానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన రాష్ట్ర కార్యదర్శి ప్రభాకర్ మాట్లాడుతూ విభజన హామీల అమలు, పోలవరం ప్రాజెక్టు నిర్మాణం నిధుల విషయం, విశాఖ ఉక్కు, రైల్వే జోన్, వెనుకబడిన ప్రాంతాలకు ప్రత్యేక ప్యాకేజీ ఇవ్వాలని కేంద్రాన్ని డిమాండ్ చేశారు.

అనుక్షణం అప్రమత్తత అవసరం

- నేటి నుంచి 18 వరకూ టెన్త్ పరీక్షలు
- దినచర్యపై విద్యార్థులు దృష్టి సారించాలి
- రెండు నియోజకవర్గాల్లో 29 పరీక్ష కేంద్రాల ఏర్పాటు
- 4,926 మంది ప్రభుత్వ, ప్రైవేటు విద్యార్థులు



కపిలేశ్వరపురం పరీక్ష కేంద్రంలో ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్న ఎంఈఓ

కపిలేశ్వరపురం: పరీక్ష కాలం రానే వచ్చింది. ఏడాది పాటు చేసిన మానసిక శ్రమకు ప్రతిఫలం దక్కే సమయం ఆసన్నమైంది. విద్యార్థి గమనానికి పునాదిగా చెప్పుకునే పదో తరగతి పరీక్షలు సోమవారం నుంచి ప్రారంభమై, ఈ నెల 18 వరకూ కొనసాగనున్నాయి. విద్యార్థి, ఉపాధ్యాయుల కృషి పరీక్షలకు ముందు, పరీక్షలకు తర్వాతగా విభజిస్తే రెండో అంకం ఆరంభమైంది. ప్రతిక్షణం అప్రమత్తంగా ఉండడం ద్వారా పరీక్షలను విజయవంతంగా పూర్తి చేసుకోవచ్చని నిపుణులంటున్నారు.

వాహనం నడిపే అర్హత లేదు

వయసు రీత్యా టెన్త్ విద్యార్థికి వాహనం నడిపే అర్హత లేదు. ఈ విషయాన్ని విద్యార్థితో పాటు తల్లిదండ్రులు కూడా గుర్తించాలి. చట్టాన్ని ధిక్కరించి వాహనంపై పరీక్ష కేంద్రానికి వెళ్తే చర్యలు తప్పవు. విద్యార్థి పరీక్ష కాలంలో ప్రమాదాల బారినపడటం, యాక్సిడెంట్ చేసి కేసుల్లో ఇరుక్కోకుండా ఉండాలంటే మోటార్ వాహనాలకు విద్యార్థి దూరంగా ఉండాలి. రామచంద్రపురం డివిజన్ పరిధిఓ ఏడాదిలో 72 మంది మైనర్లపై వాహనాలు నడిపిన కేసులు నమోదయ్యాయి. ట్రిపుల్ రైడింగ్ కేసులు జనవరి, ఫిబ్రవరి నెలల్లో 138 నమోదు కాగా ఏడాదిలో 452 నమోదయ్యాయి.

రెండు నియోజకవర్గాల్లో పరీక్షలు రాస్తున్న విద్యార్థులిలా...

	పరీక్ష కేంద్రాలు	బాలురు	బాలికలు	మొత్తం
మండపేట	09	899	854	1,753
రాయవరం	04	314	322	636
కపిలేశ్వరపురం	03	286	274	560
రామచంద్రపురం	09	835	670	1,505
కె.గంగవరం	04	235	237	472
మొత్తం	29	2,569	2,357	4,926

మీడియం వారీగా విద్యార్థులిలా..

	ఇంగ్లిష్	తెలుగు	మొత్తం
మండపేట	1,483	270	1,753
రాయవరం	452	184	636
కపిలేశ్వరపురం	327	233	560
రామచంద్రపురం	930	575	1,505
కె.గంగవరం	194	278	472
మొత్తం	3,386	1,540	4,926

సమస్య తలెత్తితే క్రింది అధికారులను సంప్రదించండి...

	ఎంఈఓ	మొబైల్	సబ్ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ పోలీస్	
మండపేట	ఎస్.రామచంద్రరావు	9440511749	అశోక్	8332957926
	బి.శివకృష్ణ	9440796592		
రాయవరం	వై.సత్యనారాయణ	9573399257	పీవీవీఎస్ఎన్ సురేష్	9440904843
కపిలేశ్వరపురం	కె.తాతారావు	9492479542	జి.చంటి	9440900770
రామచంద్రపురం	ఎం.శ్రీనివాస్	9550335097	డి.సురేష్‌బాబు	9440796589
కె.గంగవరం	నాగరాజు	9848726405	కె.చిరంజీవి	9440904848

బాధ్యతగా వ్యవహరించాలి



పదో తరగతి విద్యార్థులు పరీక్ష కాలంలో బాధ్యతతో వ్యవహరించాలి. ప్రతి క్షణాన్ని పరీక్ష రాసే ప్రక్రియకు వినియోగించుకోవాలి. వినోదాలకు దూరంగా ఉండాలి. ప్రణాళికాబద్ధంగా రోజూ దినచర్య ఉండాలి. చదువుకు, పునశ్చరణకు కచ్చితంగా సమయాన్ని కేటాయించుకోవాలి.

– పి.సురేంద్ర, ఉపాధ్యాయుడు, పడమర ఖండ్రిక

పోషక విలువలున్న ఆహారం తీసుకోవాలి



పరీక్షలు అనగానే కాస్తంత ఆందోళన ఉంటుంది. దానికితోడు ఎండలు మండుతున్న నేపథ్యంలో రోజుకు 3 లీటర్ల సురక్షిత మంచినీరు తాగాలి. ఆహారాన్ని రుచి కోసం కాకుండా శరీర సత్తువ కోసం తీసుకోవాలి. మితాహారం మేలు. కొద్దిపాటి అనారోగ్య లక్షణాలు బయటపడినా తీవ్రంగానే పరిగణించి వైద్యుడ్ని సంప్రదించాలి.

– డాక్టర్. పి.రత్నకుమారి, వైద్యాధికారి, అంగర పీహెచ్‌సీ

భవన నిర్మాణంపై ముస్లింల ఆందోళన

మండపేట: స్థానిక కలువపువ్వు సెంటర్లోని పెద్ద మసీదు స్థలాన్ని ఆక్రమించి పక్కనే ప్రైవేట్ స్థలంలో భవనం నిర్మిస్తున్నారని నిరసిస్తూ ముస్లింలు ఆదివారం ఆందోళన చేసి రోడ్డుపై ధర్నాకు దిగారు. ఇన్‌చార్జి డీఎస్పీ వెంకటరమణ, ఎస్ఐ కె.అప్పారావు ఘటనా స్థలానికి చేరుకుని ముస్లిం పెద్దలు, భవన యజమానులతో మాట్లాడారు. మసీదు స్థలాన్ని ఆక్రమించి అనధికార నిర్మాణం చేస్తున్నారని మసీదు పెద్దలు ఆరోపించారు. స్థల యజమానులు మాట్లాడుతూ తమ సొంత స్థలంలోనే నిర్మాణం చేసుకుంటున్నామన్నారు. ఇరువర్గాల వారితో మాట్లాడిన డీఎస్పీ వివాదాన్ని కోర్టు ద్వారా పరిష్కరించుకోవాలని సూచించారు.

విశ్వాసం కోల్పోయిన రాజకీయాలకు ఊపిరులూదిన జగన్

గొల్లపాలెం వైఎస్సార్ ఆసరా పంపిణీలో మంత్రి వేణు



గొల్లపాలెం వైఎస్సార్ ఆసరా పంపిణీ కార్యక్రమంలో మాట్లాడుతున్న మంత్రి వేణుగోపాలకృష్ణ

కాజులూరు: టీడీపీ నాయకుల అబద్ధపు హామీలతో ప్రజల్లో విశ్వాసం కోల్పోయిన రాజకీయాలకు ముఖ్యమంత్రి జగనన్న ఊపిరిపోశారని రాష్ట్ర బీసీ సంక్షేమ, సినిమాటోగ్రఫీ, సమాచార, పౌర సంబంధాల శాఖ మంత్రి చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాలకృష్ణ అన్నారు. మండలంలోని గొల్లపాలెం వెంకటపద్మావతి రైస్‌మిల్ గ్రౌండ్‌లో ఆదివారం సాయంత్రం వైఎస్సార్ ఆసరా చెక్కు పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. మంత్రి వేణుగోపాలకృష్ణ మాట్లాడుతూ మహిళలు ఆర్థిక స్వావలంబన దిశగా కృషి చేస్తే వారి కుటుంబం తద్వారా రాష్ట్రం పురోగతి సాధిస్తాయన్నారు. 2014 ఎన్నికల ముందు తాను అధికారంలోకి రాగానే డ్వాక్రా రుణాలు పూర్తిస్థాయిలో మాఫీ చేస్తానని చెప్పి చంద్రబాబునాయుడు మోసం చేశాడని ఐదేళ్ల గడచినా బ్యాంకు అప్పులు తీరక మహిళలు తీవ్ర అవస్థలు పడ్డారన్నారు. పాదయాత్రలో ఇచ్చిన హామీ మేరకు సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అక్కచెల్లెమ్మల అభివృద్ధే లక్ష్యంగా వారి ఖాతాల్లో వరుసగా మూడోసారి వైఎస్సార్ ఆసరా సొమ్ములను జమ చేస్తున్నారన్నారు. చేయగలిగిందే చెబుతామని, చెప్పినవన్నీ చేస్తామని మేనిఫెస్టోలో ప్రకటించిన సీఎం జగన్‌మోహన్‌రెడ్డి నవరత్నాల పథకంలో భాగంగా ఇచ్చిన హామీలన్నీ అమలు చేయడంతో పాటు అదనంగా మరికొన్ని కొత్త పథకాలు అమలు చేస్తూ రాష్ట్ర అభివృద్ధే లక్ష్యంగా పని చేస్తున్నారన్నారు. అనంతరం మండంలోని 1498 డ్వాక్రా సంఘాల్లోని 15,040 మంది సభ్యులకు గానూ ఆసరా పథకం కింద రూ.12.47 కోట్ల నమూనా చెక్కును మహిళలకు అందజేశారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ వనుం వెంకటసుబ్బారావు, ఎంపీపీ మాత భారతి, పార్టీ మండల బీసీసెల్ కన్వీనర్ గుబ్బల ఏసురాజు, స్థానిక సర్పంచ్ పోతురాజు ప్రసన్నమౌనిక, రాష్ట్ర శెట్టిబలిజ కార్పొరేషన్ డైరెక్టర్ గుత్తుల బుల్లిరాజు, మండల సచివాలయ కన్వీనర్ల కమిటీ చైర్మన్ చింతపల్లి నాగేంద్రప్రసాద్, డ్వాక్రా ఏపీఎం అనిల్‌కుమార్, సర్పంచ్‌లు పిల్లి కృష్ణమూర్తి, దండంగి సరోజని, నరాలబాలరాజు తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీలో 200 మంది చేరిక



పార్టీలో చేరిన శ్రీనివాస్ తదితరులకు కండువాలు వేసి ఆహ్వానిస్తున్న మంత్రి వేణుగోపాలకృష్ణ

రామచంద్రపురం: అర్హతే ప్రామాణికంగా సంక్షేమ పథకాలను అందజేస్తూ పారదర్శక పాలనతో వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ప్రజలకు చేరువగా వెళుతుందని అందుకే వివిధ పార్టీల నుంచి వైఎస్సార్ సీపీలో చేరుతున్నారని రాష్ట్ర బీసీ సంక్షేమం, సమాచార పౌర సంబంధాలు, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాలకృష్ణ అన్నారు. పట్టణంలోని 28వ వార్డుకు చెందిన టీడీపీ, జనసేన పార్టీల నాయకులు కలిదిండి శ్రీనివాస్ నేతృత్వంలో సుమారు 200 మంది కార్యకర్తలు వైఎస్సార్ సీపీలో చేరారు. మంత్రి వేణు వారికి పార్టీ కండువాలు వేసి సాదరంగా ఆహ్వానించారు. చేరిన వారు మాట్లాడుతూ నియోజకవర్గంలో మంత్రి వేణు చేస్తున్న వివిధ అభివృద్ధి, సేవా కార్యక్రమాలకు ఆకర్షితులై వైఎస్సార్ సీపీలో చేరినట్లు వారు తెలిపారు. కార్యక్రమంలో పట్టణానికి చెందిన పార్టీ నేతలు పాల్గొన్నారు.

మహిళలపై బాధ్యత గల ప్రభుత్వమిది

- ఎమ్మెల్సీ తోట
- వల్లూరులో వైఎస్సార్ ఆసరా చెక్కు అందజేత



వల్లూరులో ఆసరా చెక్ పంపిణీ కార్యక్రమంలో ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు

కపిలేశ్వరపురం: మహిళల పట్ల రాష్ట్ర ప్రభుత్వం ఎంతో బాధ్యతగా వ్యవహరిస్తోందని ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు అన్నారు. వల్లూరులో ఆదివారం వైఎస్సార్ ఆసరా పథకం రుణమాఫీ చెక్కును మహిళా సంఘాలకు అందజేశారు. సర్పంచ్ దాసి మీనా కుమారి అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో వల్లూరు, నేలటూరు, నిడసనమెట్ట గ్రామాల మహిళా సంఘాలకు రుణమాఫీ సొమ్ము బాపతు చెక్కు అందజేశారు ఎమ్మెల్సీ తోట, జెడ్పీటీసీ సభ్యుడు పుట్టపూడి అబ్బు, ఎంపీపీ మేడిశెట్టి సత్యవేణి, సర్పంచ్ కుక్కల వీరన్న, ఎంపీటీసీ సభ్యులు రుద్రాక్షుల వీరగౌరీకుమారి, రాష్ట్ర కమ్మ కార్పొరేషన్ డైరెక్టర్ చుండ్రు చిట్టిబాబు, వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి కర్రి పాపారాయుడు హాజరయ్యారు. తొలుత వైఎస్సార్‌కు నివాళి అర్పించారు. కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ ముత్యాల సతీష్‌కుమార్, వైఎస్సార్ సీపీ గ్రామాల అధ్యక్షులు చేంబ్రోలు వీరభద్రరావు, శనక్కాయల దొరబాబు, నాయకులు పాల్గొన్నారు.

జోరువాన.. హోరుగాలి

కాజులూరు: మండల గ్రామాల్లో ఆదివారం జోరువాన కురిసింది. ఉదయం నుంచి మధ్యాహ్నం వరకూ భానుడు తన ప్రతాపాన్ని చూపగా మధ్యాహ్నం ఒక్కసారిగా ఆకాశం మేఘావృతమై హోరుగాలితో జోరువాన కురిసింది. కాకినాడ, కోటిపల్లి రహదారిలో గొల్లపాలెం చెరువుగట్టు సెంటర్ వద్ద భారీగా వర్షపునీరు నిలిచిపోయింది. కుయ్యేరులో ఒక పెంకుటింటిపై చెట్టు కూలింది. ప్రమాదాన్ని ముందుగానే గమనించి ఇంటిలోని వారు బయటకు రావటంతో ఎవరికీ ఎటువంటి హానీ కలగలేదు. సర్పంచ్ పిల్లి కృష్ణమూర్తి సంఘటన స్థలాన్ని సందర్శించి బాధిత కుటుంబీకులను పరామర్శించారు.

రాయవరంలో అకాల వర్షం

రాయవరం: మధ్యాహ్న సమయంతో ఆకాశం మేఘావృతమై రాయవరంలో అకాల వర్షం కురిసింది. వర్షానికి తోడు ఉరుములు, మెరుపులతో పాటు ఈదురు గాలులు వీచాయి. సుమారు గంటపాటు ఎడతెరిపి లేకుండా కురిసిన వర్షానికి రహదారులు నీట మునిగాయి. ప్రధాన రహదారులతో పాటుగా వీధులన్నీ జలమయం అయ్యాయి. ఈదురు గాలులకు పలుచోట్ల వరి పంట నేలవాలింది.

అర్హులందరికీ ప్రభుత్వ పథకాలు చేరవేయాలి

మండపేట: అర్హత కలిగిన ప్రతి ఒక్కరికీ క్షేత్రస్థాయికి ప్రభుత్వ పథకాలను చేరవేయడమే లక్ష్యంగా గృహ సారథులు, వలంటీర్లు సమన్వయంతో పనిచేయాలని మున్సిపల్ చైర్‌పర్సన్ పతివాడ దుర్గారాణి అన్నారు. పట్టణంలోని 7, 10 సచివాలయాల పరిధిలోని వలంటీర్లు, గృహసారథులకు అవగాహన సమావేశం ఆదివారం స్థానిక సీతారామ కమ్యూనిటీ హాలులో నిర్వహించారు. చైర్‌పర్సన్ దుర్గారాణి, వైఎస్సార్ సీపీ రైతు విభాగం రాష్ట్ర కార్యదర్శి రెడ్డి రాజుబాబు తదితరులు హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అవినీతికి తావులేకుండా పాలనలో పారదర్శకతను తీసుకురావడంతో పాటు సంక్షేమ పథకాలను లబ్ధిదారుల చెంతకే చేరవేస్తున్న ఘనత సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి దక్కుతుందన్నారు. గృహసారథులు తమ పరిధిలోని ప్రజలతో మమేకమై ప్రభుత్వ పథకాల ద్వారా వారి వారి కుటుంబాలకు చేకూరిన లబ్ధి వివరించాలని సూచించారు. మున్సిపల్ వైస్ చైర్మన్ వేగుళ్ల నారయ్యబాబు, పట్టణ జేసీఎస్ కన్వీనర్ యరమాటి వెంకన్నబాబు, కౌన్సిలర్లు శెట్టి కల్యాణి, మెండు బాపిరాజు, బొక్కా సరస్వతి, అమలదాసు లక్ష్మి, పార్టీ నాయకులు కంది నాగశ్రీదేవి, శెట్టి నాగేశ్వరరావు, పెంకే గంగాధరం, పసుమర్తి సురేష్, తాడి రామారావు, సచివాలయ కన్వీనర్లు పాల్గొన్నారు.

మా అభివృద్ధి ప్రజలకు తెలుసు

మండపేట: పట్టణాన్ని ఎవరు అభివృద్ధి చేశారో ప్రజలకు తెలుసని ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు అన్నారు. పట్టణంలోని స్వగృహంలో ఆదివారం ఆయన మీడియాతో మాట్లాడారు. గతంలో కౌన్సిల్ తీర్మానం చేయగా, పట్టణంలోని అన్ని సంఘాల వారు ఏకమై కలువపువ్వు సెంటర్లో తన తండ్రి వేగుళ్ల వీర్రాజు విగ్రహాన్ని ఏర్పాటు చేశారన్నారు.

ఘనంగా మట్టల ఆదివారం



మట్టల ఆదివారం ఊరేగింపులో పాల్గొన్న మున్సిపల్ చైర్‌పర్సన్ శ్రీదేవి తదితరులు

రామచంద్రపురం/రామచంద్రపురం రూరల్/కాజులూరు/మండపేట/కపిలేశ్వరపురం: ఈస్టర్ పండగ ముందు జరుపుకొనే మట్టల ఆదివారం పండగను క్రైస్తవులు ఘనంగా నిర్వహించారు. పట్టణంలోని పలు క్రైస్తవ చర్చిల వద్ద నుంచి రంగురంగుల పూలతో ప్రత్యేకంగా అలంకరించిన ఈత మట్టలతో భక్తిగీతాలతో ఊరేగింపు నిర్వహించారు. మున్సిపల్ చైర్ పర్సన్ గాధంశెట్టి శ్రీదేవి, వైఎస్సార్ సీపీ పట్టణ కన్వీనర్ గాధంశెట్టి శ్రీధర్‌లు ముఖ్యఅతిథులుగా మట్టల ఆదివారం పండగ ఊరేగింపులో పాల్గొన్నారు. ద్రాక్షారామలో సీబీఎం చర్చి పాస్టర్ అబ్రహం, ఆదివారపుపేటలో రాక్ చర్చి పాస్టర్ ఆనంద్‌కుమార్, తోటపేటలో పాస్టర్ సామ్యేలు వెంకటాయపాలెం వీరేశగుళ్ల చర్చిల ఆధ్వర్యంలో ప్రధాన రహదార్లపై ఈత మట్టలు, ఖర్జూర మట్టలను చేతబూని క్రైస్తవ భక్తులు పాటలు పాడుకుంటూ ర్యాలీలు నిర్వహించారు. చేదువాడ చర్చి ఆవరణలో స్టీవెన్ చిన్నారులతో కలసి గ్రామ వీధుల్లో పర్యటిస్తూ ప్రభువు యేసుక్రీస్తు ఈ లోకానికి వచ్చి చేసిన త్యాగాలు, ప్రపంచశాంతికి ఆయన చూపిన మార్గదర్శకాలను పాటల ద్వారా భక్తులకు వివరించారు. ఏడిద గ్రామంలోని హోలీ ట్రినిటీ లూథరన్ చర్చి ఆధ్వర్యంలో చిన్నా పెద్దా అంతా ఈతకొమ్మలను పట్టుకుని ఏసుక్రీస్తును కీర్తిస్తూ గ్రామంలో ర్యాలీ చేశారు. కేశవరంలోని ట్రినిటీ లూథరన్ చర్చిలో వేడుకలు ఘనంగా జరిగాయి. తాతపూడి గ్రామ శివారు గోపాలరావుపేటకు చెందిన జీసస్ ప్రేయర్ హౌస్, టీకే ప్రార్థన మందిరాలకు చెందిన క్రైస్తవులు ఆయా గ్రామాల్లో మట్టల ఆదివారం సందర్భంగా ర్యాలీ చేశారు.